



హైదరాబాద్ వార్త

# సిఈఐజి పోస్టుకు జోరుగా పైరవీలు!

-కుర్చీ కోసం పోటాపోటీగా ప్రయత్నాలు..
-అర్హతలు లేకున్నా.. ప్రభుత్వ పెద్దలచుట్టూ ప్రదక్షిణలు
-అడ్డదారిలో రావడం..అడ్డగోలుగా వసూళ్లు చేయడం
-విద్యుత్ తనిఖీ అధికారి కార్యాలయంలో ఇదే నిత్యకృత్యం






**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి కార్యాలయంలో మళ్లీ కుర్చీలాట మొదలైంది. ఈ బంగారు బాతులాంటి కుర్చీని చేజిక్కించుకునేందుకు తాజాగా మరికొంత మంది పైరవీకారులు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇక్కడ సీఈఐజీగా పనిచేస్తున్న వ్యక్తి పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. దీంతో ఆకుర్చీని ఆశిస్తున్న పలువురు ఆఫీసర్లు ప్రభుత్వంలోని పెద్దలు, సచివాలయ కేంద్రంగా పని చేస్తున్న ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. గతకొన్నేళ్లుగా సీనియార్టీ, ఇతర అర్హతలతో సంబంధం లేకుండా భారీగా ముడుపులు చెల్లించిన వారికే ఈ పీఠాన్ని కట్టబెడుతుండటంతో ఆశావహులు ఆ మేరకు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇప్పటికే ఓ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్స్‌పెక్టర్ అడ్డదారుల్లో ఎలక్ట్రికల్ ఇన్స్‌పెక్టర్‌గా పదోన్నతి పొందినట్లు తెలిసింది. ఈ విషయం మరో డిప్యూటీ డీఈకి తెలిసి కోర్టు ద్వారా ఈ చర్యను అడ్డుకున్నట్లు సమాచారం. ఇందుకు సదరు డిప్యూటీ ఎలక్ట్రిర్ ఇన్‌స్పెక్టర్ కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తుంది. భారీ బహుళ అంతస్తుల భవనాలు, సినిమా హాళ్లు, హోటళ్లు, పరిశ్రమల్లో విద్యుత్ ప్రమాదాల నియంత్రణ కోసం ప్రభుత్వం తెలంగాణ ప్రధాన విద్యుత్ తనిఖీ విభాగాన్ని 1987లో ఏర్పాటు చేసింది. 15 మీటర్ల ఎత్తు ఉన్న భవనాలు సహా 70 కిలోవాట్స్ సామర్థ్యానికిమించి విద్యుత్తు డిమాండ్ ఉన్న ప్రతి కనెక్షన్స్‌కు వీరి అనుమతి తప్పని సరి చేసింది. ఈ నిబంధనే వీరికి కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రస్తుతం ఇక్కడ ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి (సీఈఐజీ) తో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి-1,2,3 డివిజన్లు, మెదక్-1,2 డివిజన్లు, మహబూబ్‌నగర్, నిజామాబాద్ డివిజన్లకు ఒక్కో డిప్యూటీ డీఈ ఇంఛార్జ్‌గా పని చేస్తున్నారు. వీరితో పాటు హైదరాబాద్, నిజామాబాద్‌లకు ఇద్దరు ఈఐలు కూడా ఉన్నారు. లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి, పది మంది డీఈలు, ముగ్గురు ఏఈలున్నారు. 2018 నుంచి ప్రభుత్వం ఎలాంటి నియామకాలు చేపట్టలేదు. సీఈఐజీ సహా ఇతర కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ సీఈఐజీ స్థాయి అధికారే వీటన్నింటికీ ఇంఛార్జ్ సీఈఐజీగా వ్యవహరిస్తున్నారు. ఒక్కరే నాలుగు కీలక పోస్టుల్లో కొనసాగుతున్నారు. బిల్డర్లు, పరిశ్రమల యజమానులు థర్డ్‌పార్టీతో విద్యుత్ పనులు చేయిస్తుంటారు. ఐఎస్ఐ సర్టిఫైడ్ విద్యుత్ పరికరాలకు బదులుగా, మార్కెట్లో తక్కువ ధరకు లభించే నాసిరకం కేబుళ్లు, ఎంసీబీలు, బ్రేకర్స్, ఆర్సీసీబీలు, ఎర్తింగ్స్ రాడ్స్‌ను వాడుతున్నారు. భవిష్యత్తు అవసరాల మేరకు లైన్లు, కేబుళ్లు, ఎంసీబీలు వాడకపోవడంతో ఆతర్వాత కొద్ది రోజులకే షార్ట్‌సర్క్యూట్ తలెత్తి అగ్నిప్రవదాలకు కారణమవుతున్నారు. వీటిని పూర్తిగా అరికట్టాల్సిన సీఈఐజీ నామ మాత్రపు తనిఖీలతో కాంట్రాక్టర్లు ఇచ్చింది పుచ్చుకుని, సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. ఫలితంగా రూ.కోట్ల ఆస్తినష్టంతో పాటు విలువైన ప్రాణాలను కోల్పోవాల్సి వస్తోంది.

**కాసులిస్తేనే సరి..లేదంటే కిరికిరి..**

2020 నవంబర్ నుంచి 2025 ఏప్రిల్ 25 నాటికి టిఎస్ఐపాస్ ద్వారా 13,453 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 12,609 దరఖాస్తులను ఆమోదించారు. ఇక జనరేటర్ల ఏర్పాటు అనుమతి కోసం 1072 దరఖాస్తులు రాగా, వీటిలో 994 ఆమోదించారు. 93 సినిమా థియేటర్ల నుంచి దరఖాస్తులు రాగా, వీటిలో 83 ఆమోదించారు. దరఖాస్తు, సీఈఐజీ తనిఖీ, అయితే అనుమతి ధృవీకరణ పత్రం జారీ కోసం రూ.10 వేల లోపే ఫీజు నిర్ణయించింది. అంతేకాదు దరఖాస్తు చేసిన 14 రోజుల్లోనే తనిఖీలు పూర్తి చేసి, ఆమోదించడమో, తిరస్కరించడమో చేయాలి. కానీ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్లు మొదలు, సీఈఐజీ వరకు ఎవరి స్థాయిలో వారు ఫైళ్లను రోజుల తరబడి తొక్కిపెడుతున్నారు. బిల్డింగ్ విద్యుత్ లైన్స్ డ్రాయింగ్, టీఎస్‌బిపాస్ పోర్టల్‌లో అప్‌లోడ్ మొదలు, క్షేత్రస్థాయిలో తనిఖీలు, ఆమోదం వరకు ఇలా భవన నిర్మాణ సామర్థం, పరిశ్రమ సామర్థ్యాన్ని భట్టి.. ఒక్కో ఫైలుకు ఏడు నుంచి పది లక్షలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ కంపెనీలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, సోలార్ పవర్ యూనిట్ల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. అంతేకాదు ఆ తర్వాత పీరియాడికల్ ఇన్స్‌పెక్షన్ పేరుతో ఏడాదికోసారి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇచ్చేందుకు నిరాకరించిన వారి ఫైళ్లపై రకరకాల కొర్రిలు పెట్టి తిప్పిపంపుతున్నారు. సీఈఐజీ మొదలు ఇక్కడ పని చేస్తున్న ప్రతి ఇన్స్‌పెక్టర్ దీన్ని ఓ బంగారు బాతులా భావిస్తున్నారు. అడ్డదారుల్లో పోస్టింగ్‌లు సంపాదించి, ఆ తర్వాత ప్రతి ఫైలుకు ఓ రేటు ఫిక్స్ చేసి, బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు.

# పాకిస్తానీలు సరే..అక్రమ విదేశీయుల సంగతేంటి?

- వివరాలపై ఆరా తీస్తున్న నగర పోలీసులు
- వేలల్లో నైజీరియన్లు, బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు
- మాదకద్రవ్యాల విక్రయాల్లో వారే అధికం




**హైదరాబాద్, ఏప్రిల్26, ప్రభాతవార్త:** పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తానీల పీడ విరగడకానుంది. మెడికల్ వీసాల మినహా ఆదివారంతో బిజినెస్, స్టూడెంట్ అన్ని రకాల వాటిపై గడువు ముగియనుంది. అయితే వారిని పంపించడంతో పాటు ఇక్కడే అక్రమతిష్ట వేసే వారి భరతంపట్టేందుకు వ్యూహాత్మాక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే శనివారం నల్గురి పాకిస్తానీలకు నోటీసులు అందజేయగా... ఇతర విదేశీయుల వివరాలను ఆరా తీస్తున్నారు. వేలల్లో నైజీరియన్లు, బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు ఉన్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఆర్థిక సంక్షోభం, మత్తుపదార్థాల విక్రయాలకు వారే అధికశాతం ఆజ్యం పోస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల పట్టుబడిన వారిలో అధిక సంఖ్యలో నైజీరియన్లే ఉన్నారు.

**విజిట్ వీసాలే అధికం...**

పాకిస్తాన్‌తో పాటు బంగ్లాదేశీ, నైజేరియాన్, కజకిస్తాన్, సొదీల్లాంటి ఇతర దేశాల వారు ఏటా భారత్‌కు వస్తున్నారు. సాధారణంగా విడిది కోసం వచ్చి వీసా ముగించిన అక్రమంగా ఉంటున్నారు. హైదరాబాద్, దిల్లీ, గోవా, బెంగళూర్, ముంబాయి లాంటి మహనగరాల్లో రహస్యంగా తలదాచుకుంటున్నారు. వీరి రాకపోకలపై పోలీసులు దృష్టిసారించకపోవడంతో కొత్త నేరాలకు తెరలేపుతున్నారు. ఇక్కడ కార్యకలాపాలను పసిగట్టి స్నేహితులతో రాయబారం నడుపుతూ మోసాలకు తెగిస్తున్నారు. ముఖ్యంగా కొకైన్, కేఫ్‌లైన్‌లాంటి డగ్స్‌ను సరఫరా చేస్తూ తీవ్రమైన నేరాలకు ఉసిగల్పుతున్నారు. అయితే పోలీస్ యంత్రాగం వద్ద వీరి పూర్తిస్థాయి వివరాలు లేనట్లే తెలుస్తోంది. ఏదైన ఘటన జరిగితేనే వెల్లడయ్యే అవకాశం లేకుండా పోయింది.

**ప్రతీ కదలిక తెలియాల్సిందే...ఇకపై ఉక్కుపాదమే**

డ్రగ్స్‌లాంటి మత్తుపదార్థాలపై ప్రభుత్వం సీరియస్‌గానే ఉంది. ఎక్కడ ఏం చిన్నపాటిది దొరికిన ఆరాచకులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఎవరెవరు ఏం చేస్తున్నారనే విషయాలు కూడా రాబట్టాల్సిన అవసరం ఉంది. రోజువారి కలపాలపై ఆరా తీయాలి. పాస్‌పోర్టు, వీసాల గడువును తనీఖీ చేయాలి. నకిలీపత్రాలను పరిశీలించాలి. కార్డన్‌సర్చ్‌లతో ప్రాంతాలను జల్లెడపట్టడంతో ఎంతో మంది పట్టుబడిన సందర్భాలు ఉన్నాయి. అక్రమ తిష్టవేసిన వారే పోలీసుల కళ్లగప్పి ప్రాం తాలు మారుతూ తప్పించుకుంటున్నట్లు తెలు స్తుంది. అదికంగా ఉంటున్న పాతబస్తీ, టోలిచౌకి, లంగర్ హౌజ్, గోల్కొండ ప్రాంతాల్లో వారి రాకపోకలను పోలీసులు ప్రత్యేక దృష్టిసారించి నిఘా ఏర్పాటు చేస్తున్నారు.ఏదీ ఏమైన చిన్న పాటి నేరం చేసినట్లు రుజువైతే శిక్ష మరింత కఠినంగా వేయనున్నారు. అయితే ఇప్పటికే సైబర్ క్రైం,మాదకద్రవ్యల్లాంటి విక్రయాలపై రూ.కోట్లు సొమ్ముచేసుకుంటున్న వారిపై కొరడా ఝూ లిపిస్తున్నారు.

## సిసి కెమెరాల ఏర్పాటుతో సత్ఫలితాలు : కమిషనర్ సుధీర్‌బాబు



సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్‌బాబు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ఏర్పాటు వల్ల సత్ఫలితాలను సాధించడం జరిగిందని కమీషనర్ జి.సుధీర్‌బాబు వెల్లడించారు. హైదరాబాద్ నగర శివార్లలోని మహేశ్వరం జోన్ పరిధిలో రూ.68 లక్షల వ్యయంతో కొత్తగా ఏర్పాటు చేసిన 855 సిసి కెమెరాల ప్రారంభోత్సవం బాలాపూర్ సమీపంలోని మల్లాపూర్‌లో యెల్మేటి అమరేందర్‌రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక జోన్ డిసిపి డి.సునీతారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమీషనర్ పలువురు పోలీసు అధికారులతో కలిసి స్విచాన్ చేసి సిసి కెమెరాలను ప్రారంభించారు. జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 138 దేవాలయాల వద్ద 566 సిసి కెమెరాలు, ముఖ్యమైన రహదారులు, చౌరస్తాలలో 289 సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. అయితే కెమెరాల ప్రారంభోత్సవం అనంతరం జరిగిన సమావేశంలో సుధీర్‌బాబు మాట్లాడుతూ నేరాల పరిశోధనలో సిసి కెమెరాల ప్రాధాన్యత ఎంతో ఉన్నదని తెలిపారు. సిసి కెమెరాలు ఏర్పాటై ఉన్న చోట్ల నేరాలు చేయాలనుకునేవారు వెనుకడుగు వేస్తున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికే సిసి కెమెరాల వల్ల కీలకమైన కేసుల్లో పురోగతి సాధించడం జరిగిందని కమీషనర్ వివరించారు. ఇందులో ఆదిభట్ల పరిధిలో ఎటిఎం చోరీ, మల్కాజిగిరి పరిధిలో హత్య కేసు, మీర్‌పేట్ పరిధిలోని రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి భార్య హత్య కేసుతో పాటు చాలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దాదాపు 31 కేసుల్లో సిసి కెమెరాల సాక్ష్యం చాలా ఉపయోగపడిందని ఆయన అన్నారు. దేశంలోనే తెలంగాణ పోలీసులు నేర విచారణలో టాప్‌గా నిలిస్తే అందులో రాచకొండ పోలీస్ కమీషనరేట్ సిసి కెమెరాల ఏర్పాటులో మొదటి స్థానంలో ఉందని ఆయన వెల్లడించారు. మూడున్నర నెలల్లో 57 కేసుల్లో మంచి ఫలితాలు సిసి కెమెరాల వల్ల వచ్చాయని ఆయన తెలిపారు. కమీషనరేట్ పరిధిలో సిసి కెమెరాల ఏర్పాటును నిరంతర ప్రక్రియగా చేస్తామని కమీషనర్ స్పష్టం చేశారు. త్వరలో మరో 350 సిసి కెమెరాలను వివిధ చోట్ల ఏర్పాటు చేయనున్నామనీ ఇందులో భాగంగా యాదగిరి గుట్ట వద్ద కూడా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఏర్పాటు చేసిన సిసి కెమెరాల నిర్వహణ బాధ్యత తీసుకుంటామని సుధీర్ బాబు తెలిపారు. కెమెరాలను ఏర్పాటు చేయించిన పోలీసు అధికారులకు, సహకరించిన దాతలను కమీషనర్ అభినందించారు. అనంతరం కెమెరాల ఏర్పాటు దాతలను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డిసిపి డి.సునీతారెడ్డి, అడిషనల్ డిసిపి బివి సత్యనారాయణ, ట్రాఫిక్ అడిషనల్ డిసిపి సి. కుషాల్‌కర్, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపల్ కమీషనర్లు వెంకట్‌రాం, వాణిరెడ్డి, మహేశ్వరం ఎసిపి పి.లక్ష్మీకాంత్‌రెడ్డి, ఐటి సెల్ ఎసిపి జె.నరేందర్ గౌడ్, ఇబ్రహీంపట్నం ఎసిపి కెవిపి రాజు, స్థానిక బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్, వివిధ పిఎస్‌ల ఇన్స్‌పెక్టర్లతో పాటు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, తోట శ్రీధర్‌రెడ్డి, తుక్కుగూడ మాజీ వైస్ ఛైర్మన్ భవాని వెంకట్‌రెడ్డి, జెనిగె శ్రీనివాస్ యాదవ్, వివిధ ప్రాంతాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, దాతలు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు నోడల్ ఏజెన్సీ అవసరం

-హైడ్రా కమిషనర్ ఎ.వి రంగనాథ్




వివిధ విభాగాల ప్రతినిధులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ప్రమాదాల నివారణకు విద్యుత్, ఫైర్, ఇండస్ట్రీ ఇలా ఎవరికి వారు కాకుండా..ఇందుకు ఉద్దేశించిన వ్యవస్థలన్నీ ఒక ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చి పని చేయాల్సినవసరం ఉందని హైడ్రా కమిషనర్ ఏ.విరంగనాథ్ అన్నారు ఎలక్ట్రికల్ సేఫ్టీ ఇన్ బిల్డింగ్స్ అనే అంశంపై శనివారం హైడ్రా కార్యలయంలో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. విద్యుత్ వినియోగంలో ఉన్న లోపాలవల్లే ఎక్కువ అగ్ని ప్రమాదాలు జరుగుతున్న వేళ.. తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు.. అందరిలో అవగాహన పెంచడం అవసరం ఉందన్నారు. భద్రతకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకున్నారో లేదో పరిశీలించడానికి సంబంధిత విభాగాలకు చెందిన నిపుణుల బృందంతో ఒక నోడల్ ఏజెన్సీని రూపొందించాలని అభిప్రాయపడ్డారు. విద్యుత్ వైరింగ్, ఎర్తింగ్, నాణ్యమైన ఎలక్ట్రిక్ పరికరాలను వినియోగిస్తున్నారా లేదా అనేది తనిఖీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలే కాకుండా అపార్టుమెంట్లు, కార్యాలయాలు, నివాసాలలో కూడా భద్రతా ప్రమాణాలు పాటించేలా ఈ నోడల్ ఏజెన్సీ చూడాలన్నారు. దుర్ఘటన జరిగిన తర్వాత పోస్టుమార్టం చేసేలా కాకుండా.. అందుకు ఆస్కారం లేని విధంగా చర్యలు తీసుకోవాలని.. అందుకే ఈ సదస్సు పెట్టామన్నారు. హైడ్రాకు చెందిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు విభాగం ఈ సమన్వయాన్ని తీసుకు రావాలని సూచించారు. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాల్, బాయిలర్స్ డిపార్టుమెంట్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ భీమారావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ పరిశ్రమలు, భారీ కట్టడాలు, నివాస సముదాయాల భద్రత విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించారు. ఈకార్యక్రమంలో హైడ్రా ఫైర్ విభాగం అదనపుసంచాలకులు పాపయ్య, ఎస్‌పీ సుదర్శన్, డిప్యూటీ కలెక్టర్ సుధ, ఆర్ ఎఫ్‌వో జయప్రకాశ్, డీఎఫ్‌వోలు యజ్ఞనారాయణ, గౌతం, ఎస్ ఎఫ్‌వోలుపాల్గొన్నారు.

## నేత్రపర్వం సత్యకీర్తి కూచిపూడి నాట్యహేళ



కూచిపూడి నృత్యహేళలో ప్రదర్శనలిచ్చిన వందలాది కళాకారులు

**రవీంద్రభారతి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** సత్యకీర్తి నిత్యధామం కూచిపూడి నృత్యకళాశాల వ్యవస్థాపకుడు, నాట్యగురు దొడ్డ బాలాజీకుమార్ నృత్యశిక్షణలో సుశిక్షితులుగా మలచబడిన యువనర్తకులు 108మంది తమ అందెలరవళిలతో కూచిపూడి నాట్యహేళ శీర్షికతో వివిధ అంశాలతో జరిపిన అద్భుత నృత్యవిన్యాసాలు ఆహుతులైన అశేష ప్రేక్షకులు, ఔత్సాహిక కళాభిమానులకు నేత్రపర్వం కావించి మంత్రముగ్ధులను చేశారు. సంస్థ నాల్గవ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురు బాలాజీకుమార్ నేతృత్వంలో కూచిపూడి నాట్యహేళ ముందుగా గణేష్ వందనంతో ప్రారంభమై జతిస్వరం, అన్నమయ్య, త్యాగరాజ కీర్తనలు, శివాష్టకం, ఆనంద తాండవం, అష్టలక్ష్మిస్తోత్రం, మహిషాసురమర్ధిని వంటి అతిక్లిష్టమైన నృత్యాంశాలను అవలీలగా ప్రదర్శించి ప్రేక్షకులను సమ్మోహనపరిచి తన్మయుల్ని కావించారు. ప్రముఖంగా గురువు బాలాజీకుమార్ తన కుమార్తె కీర్తనతో కలిసి కన్నులపండువగా నర్తించడం విశేషం. ఈ కార్యక్రమానికి ప్రముఖ నాట్యగురువులు డా. వనజ ఉదయ్, లక్ష్మి తదితరులు ప్రత్యేక అతిథులుగా విచ్చేసి నాట్యహేళలో అద్భుత నృత్యపరిమళాలు వెదజల్లి మెప్పించిన కళాకారుల ప్రతిభను ప్రశంసించి శుభాశీస్సులు అందజేశారు. ఈ నృత్యకళాశాల నుండి ఐదువందలకుపైగా విద్యార్థులు శిక్షణ పూర్తిచేసుకోవడమే కాకుండా రెండువందలమంది నృత్యంలో సర్టిఫికెట్ డిప్లమా కోర్సులు పూర్తిచేయడంతోపాటు దేశవిదేశాల్లో ఐదువందలకుపైగా ప్రదర్శనల్విడమేకాక నాదనీరాజనంలో ప్రదర్శనలిచ్చి శుభాభినందనలు పొందారని అతిథులు కొనియాడారు.

## పతకం ప్రకారమే దొంగతనం

-దోపిడీ కేసును చేధించిన రాజేంద్రనగర్ పోలీసులు

-ఆరుగురు నిందితులు అరెస్టు..సొత్తు స్వాధీనం




**అత్తాపూర్ ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** పట్టపగలే ఇంట్లో చొరబడి దంపతులను బెదిరించి నగదు, బంగారం దొచుకెళ్లిన కేసును రాజేంద్రనగర్ పోలీసులు చేధించారు. ఇందుకు సంబంధించిన వివరాలను డిసిపి సిహెచ్ శ్రీనివాస్ వెల్లడించారు.... రాజేంద్రనగర్ పోలీసులు స్టేషన్ పరిధిలోని సన్‌సిటి పిటిఅండ్‌టి కాలనీలో నివాసముంటున్న మహ మ్మద్ షకీర్ అలీకి తెలిసిన బంధువు అయిన జిబ్రాన్ బిన్ జాబర్ వారి స్నేహితులతో కలిసి పతకం ప్రకారం ఈనెల 21న స్విఫ్ట్ డిజైర్ కారులో వచ్చి బాధితుడి ఇంట్లో చొరబడి కత్తులతో దంపతులను బెందిరించి బంగారం,నగదు దొచుకొనే పారిపోయారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆరుగురు నిందితులు ఎ1 జిబ్రాన్ బిన్ జాబర్,ఎ2 మొహ మ్మద్ అకిల్,ఎ3 మొహమ్మద్ ఫసియుద్దిన్,ఎ4 సొహైల్ షా ఖాన్,ఎ5 .మొహమ్మద్ అబ్దుల్ రబ్ జావిద్, ఎ6,మొహమ్మద్ షబ్బీర్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు.వారి నుండి బంగారు,వెండి ఆభరణాలు ,నగదు, రెండు మొబైల్ ఫోన్,ఆయుదాలను స్వాధీనం చేసుకున్నారు.కేసును చేధించిన పోలీసు సిబ్బందిని డిసిపి అభినందించారు.

## పొగతో ఊపిరాడక బాలుడు మృతి

**హయత్ నగర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** దోమల కోసం పెట్టిన మస్కిటో కాయిల్ పరుపుపై పడి పరుపు కాలిపోగా ప్రమాదంలో పొగతో ఊపిరాడక చిన్నారి బాలుడు చనిపోగా... మరో బాలిక పరిస్థితి విషమంగా ఉంది. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి లో జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.... పెద్ద అంబర్పేట్ గ్రామం భువనేశ్వరి కాలనీకి చెందిన అబ్దుల్ ఖాదర్ జిలానీ కి నలుగురు సంతానం. శుక్రవారం రాత్రి జిలాని తన పెద్ద కుమారుడు అర్హన్, పెద్ద కుమార్తె ఆఫియా తో కలిసి ఇంట్లో హాల్ లో పడుకున్నారు. అతని భార్య ఫాజియాబేగం చిన్న కుమారుడు రెహమాన్, ఆతిఫా తో కలిసి మరో గదిలో పడుకున్నారు. శనివారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో దోమల కోసం పెట్టిన మాస్కిటో కాయిల్ పరుపు పై పడడం తో పరుపు కాలి పొగవచ్చింది. పొగతో ఊపిరి ఆడక రెహ మాన్ చనిపోగా.ఆతిఫా ఆరోగ్యం విషంగా ఉండడంతో నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురి అరెస్టు

**సైదాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని సైదాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సైదాబాద్ పోలీ స్ స్టేషన్ పరిధిలోని కేశవనగర్ కాలనీలోని ఒక ఇంటిలో అక్రమంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సైదాబాద్ పోలీసులకు ఈ నెల 24వ తేది రాత్రి విశ్వసనీయ సమాచారం అందడంతో వెంటనే పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. అక్కడ నలుగురు వ్యక్తులు ఆఫ్‌లైన్ విధానంలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతూ డబ్బులు వసూలు చేస్తున్నారని పోలీసులు నిర్ధారించారు. గుడిమల్కాపూర్‌కు చెందిన జి.శరత్ చంద్ర(38), కార్వాన్‌కు చెందిన సందీప్‌కర్ సాగర్(39), తాళ్లగడ్డకు చెందిన జి.సాయికుమార్(40), కేశవనగర్‌కు చెందిన జి.ఉత్తమ్‌చంద్రయాదవ్(38)లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4.10లక్షల నగదు, అయిదు సెల్‌ఫోన్లు, బెట్టింగ్‌కు ఉపయోగిస్తున్న పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. బుకీ యోగేష్, కలెక్షన్ ఏజంట్ శ్రీధర్‌లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## నాచారం స్క్రాప్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

-మంటలు ఎగిసిపడటంతో భయాందోళనకు గురైన స్థానికులు



అగ్నిప్రమాదంతో ఫ్యాక్టరీలో ఎగిసి పడుతున్న మంటలు

**నాచారం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** నాచారం ఇంపీఎస్ పరిధిలో శనివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. స్క్రాప్ గోదాంలో అగ్ని ప్రమాదం కారణంగా విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. అగ్నిప్రమాదంగా కారణంగా భారీగా ఎగిసి పడిన మంటలు. దీంతో విషయం తెలుసుకున్న అగ్నిప్రమాద సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.అగ్నిమాపక సిబ్బందిసుమారు రెండు గంటల నుంచి మంటల ఆర్పా రు. గోదాంలో ప్లాస్టిక్ వస్తువులు అంటుకోవడంతో దట్టమైన పొగలు అలుముకు న్నాయి గోదాంకి ఎటువంటి పేరు లేదు. కనీసం నేమ్ ప్లేట్ కూడా లేదు. ఇదే గోదాంలో గతంలో కూడా ఒకసారి ఫైర్ ఆక్సిడెంట్ అయినట్లు స్థానికులు తెలిపారు.

## చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

**దుండిగల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** గాగిల్లాపూర్ చెరువులో దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బతుకు దెరువు కోసం ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పూజా గుప్తా (35), జై సింగ్ గుప్తాలు భార్యాభర్తలు నగరానికి వచ్చి దుండిగల్ తండా 2లో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఓ మహిళ గాగిల్లాపూర్ చెరువులో ఆత్మహత్య చేసుకుందన్న సమాచారంతో పెట్రోల్ మొబైల్ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. భర్త జై సింగ్ గుప్తా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పి.సతీష్ తెలిపారు. భార్యాభర్తల మధ్య తగాదాల వల్లనే మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మహనీయుల వారసత్వాన్ని, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలి : మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్ రెడ్డి

**జీడిమెట్ల, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

సూరారం కాలనీ తెలుగు తల్లి నగర్‌లో ఏర్పాటు చేసిన మహనీయులు ఉత్సవలలో సురేష్ రెడ్డి పాల్గొని మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్బంగా సురేష్ మాట్లాడుతు మహనీయుల ఉత్సవాలు అంటే దేశం, సమాజం, మానవాళికి గొప్ప సేవ చేసిన వ్యక్తుల జయంతి ఉత్సవాలను నిర్వహించడం. ఈ ఉత్సవాల్లో మహనీయుల ఆశయాలను స్మరించుకోవడం, వారి సేవలను సగౌరవంగా గుర్తుచేసుకోవడం అని అన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడిన మహనీయుల వారసత్వాన్ని, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లినప్పుడే వారికి నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్, 129 డివిజన్ అధ్యక్షులు భాస్కర్, సుభాష్ నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, రాజు గౌడ్, డివిజన్ యూత్ అధ్యక్షులు జహంగీర్ పాల్గొన్నారు.

## ఉగ్రమూకల దాడి అమానుష చర్య : పవన్‌ఖేరా, కోటనీలిమ



పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా చేపట్టిన క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న పవన్‌ఖేరా, డా.కోటనీలిమ తదితరులు.

**బేగంపేట ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

పహల్గాంలో ఉగ్రమూకలు జరిపిన దాడి అమానుష చర్య అని పవన్‌ఖేరా, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమలు అన్నారు. వీరిద్దరి నేతృత్వంలో నెక్లెస్ రోడ్డులో నిర్వహించిన క్యాండిల్ లైట్ మార్చ్‌లో బేగంపేట డివిజన్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విశాల్ సుధాం, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్‌ఖేరా, డా.కోట నీలిమలు మాట్లాడుతూ ఇలాంటి ఉగ్రదాడులను ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా ఖండించాలన్నారు. ఈ క్యాండిల్ ర్యాలీలో విశాల్‌సుధాం, హనీఫ్ ఖాన్, నసీరుద్దీన్ (అడ్డూ), చిరంజీవి, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ యువ నేత ఆసిఫ్ ఖాన్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి రమేష్

**కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవం వేడుకల ముందు ఆ పార్టీ యువ నాయకుడు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కూకట్‌పల్లి బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆసిఫ్ ఖాన్ శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్బంగా బండి రమేష్ ఆసిఫ్ ఖాన్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ ఖాన్ మాట్లాడుతూ త్వరలో కూకట్‌పల్లి నుంచి తన ఆధ్వర్యంలో మరింత మంది కాంగ్రెస్ పార్టీలో చేరుతారని అన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమంలో పాలు పంచుకోవాలని, పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేయాలని పార్టీ బలోపేతానికి శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, మూసాపేట మాజీ అధ్యక్షుడు చున్ను పాషా, సంజీవ, బాలానగర్ డివిజన్ ప్రెసిడెంట్ మధు గౌడ్ పాల్గొన్నారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తాం

### - బండ్లగూడ కార్పోరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

**నార్సింగి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**



బండ్లగూడ కార్పోరేషన్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లు, ఆస్థిపన్ను వసూళ్లపై సమీక్ష చేస్తున్న కమీషనర్ శరత్‌చంద్ర

అర్హులందరికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పతకాలు అందేలా చూస్తామని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. శనివారం కార్పోరేషన్ కార్యాలయంలో సంక్షేమ పతకాలపై ప్రత్యేక సమావేశంను నిర్వహించారు. ఈ సందర్బంగా కమీషనర్ శరత్ చంద్ర మాట్లాడుతూ విచారణ అధికారులకు పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లు రాజీవ్ యువ వికాసం, ఆస్థిపన్ను వసూళ్లు, చేయూత పెన్షన్‌లపై పారదర్శకమైన విచారణ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు లోబడి ఉన్న పేదలందరికి సంక్షేమ పతకాలు దక్కేలా చూడాలని, నిబంధనలకు లోబడి లేని వారు దరఖాస్తు చేస్తే నిర్దాక్షిణంగా తోసిపుచ్చాలన్నారు. ప్రభుత్వ పతకాలు అందరికి అందించడంతో పాటు ప్రజల సమస్యల పట్ల వేగంగా స్పందించాలని సూచించారు. ముఖ్యంగా ఈ వేసవిలో ప్రజలు మంచినీటి ఇబ్బందులు పడకుండా విదులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఇ యాదయ్య, ఆర్‌ఓ శివకుమార్, ఎఇఇ రాజ్ కుమార్, వివిధ సెక్షన్ల అధికారులు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ సభకు వేలాదిగా తరలివెళ్లి విజయవంతం చేద్దాం

### - నార్సింగి మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి

**నార్సింగి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**

వరంగల్‌లో జరుపుతున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలకు నార్సింగి మున్సిపాలిటీ నుంచి వేలాది మందిమి తరళి వెళ్లి విజయవంతం చేద్దామని నార్సింగి మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు కె.విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నార్సింగి బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14.ఏళ్ల ఉద్యమ పార్టీగా, 10.ఏళ్ల అధికార పార్టీగా రాష్ట్ర ప్రజలకు బిఆర్ఎస్ చేసిన సేవలు ప్రజల గుండెల్లో ఉన్నాయన్నారు. కేవలం ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలోనే తెలంగాణ ప్రజలు విసిగి పోయారని, అభివృద్ది నిలిచిపోయిందని, ఆర్ధిక పరిస్థితి దారుణంగా మారిందని బాధ పడుతున్నారన్నారు. ఎప్పుడెప్పుడు సంక్షేమ పతకాల ప్రదాత కేసీఆర్ పాలన వస్తుందా? అని రాష్ట్ర ప్రజలు ఎదిరి చూస్తున్నారన్నారు. వరంగల్ మహాసభతో మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ భావి రాజకీయాల ముఖ చిత్రంను మార్చివేయబోతున్నారన్నారు. ఇక నుంచి తెలంగాణ అంతా పర్యటిస్తూ, ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, గ్యారంటీలు అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతారన్నారు. వరంగల్ సభను పురస్కరించుకొని నార్సింగి మున్సిపల్ రహదారులన్నింటిని గులాబీమయంగా మార్చివేశారు.

## కబ్జాదారుల చెరనుంచి పార్కుని కాపాడండి



సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రియ, శ్రీకాంత్‌రావు తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**

కిస్మత్ పూర్, బండ్లగూడ జాగిర్ లో దాదాపు 4వేల చదరపు గజాల పార్కుతో కలిపి వెంచర్ నిర్మించిన ఓనిర్మాణ సంస్థ ఇప్పుడు ఆ పార్కును కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు నిర్మించింది స్థానికురాలు హరిప్రియ దర్శిని మేకల ఆరోపించారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తన భర్త శ్రీకాంత్ రావు తో కలిసి కబ్జా అయిన పార్కుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్క్ పక్కన ఆహ్లాదకరంగా ఉంటుంది అని తాను 500 గజాల ప్లాట్ ను కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకోవడం జరిగిందన్నారు. అయితే తన ఇంటి ముందు నుండి దాదాపు 40 ఫీట్ల రోడ్డు పార్కు స్థలానికి వెళ్లడానికి కేటాయించబడింది అని కానీ అత్యాశతో సదరు బిల్డర్ పార్కు స్థలాన్ని సైతం అక్రమంగా ప్లాట్స్ చేసి విక్రయించారు అని ఆమె ఆరోపించారు. ఇప్పుడు పక్కనున్న వెంచర్ నిర్మించిన ప్రహరీ గోడతో తమ ఇంటి ముందు ఉన్న రోడ్డు 40 ఫీట్లు కాస్త 16 ఫీట్లకి కుదింపబడింది అని ఈరోడ్డు నుండే పార్క్‌కి వెళ్లే స్థలం కాస్త ఆక్రమించబడి కొత్త నిర్మాణాలు జరిగాయని ఫలితంగా పార్కు మొత్తము ఆక్రమించబడిందన్నారు. ఇప్పుడు పార్క్ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలు కూల్చివేసి పార్కును యధాతధంగా అప్పగించాలని న్యాయపోరాటం చేస్తున్న తమను బిల్డర్ తీవ్రంగా వేధిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ ఉన్నతాధికారులు, హైడ్రా, ప్రజావాణి తో పాటు తాము ఇప్పటికే ఐదు చోట్ల ఫిర్యాదులు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీనిపై సమగ్ర విచారణ జరిపించి మున్సిపల్ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం : ఠాకూర్ జీవన్ సింగ్


కార్వాన్ డివిజన్ లోని కార్యకర్తలతో మాట్లాడుతున్న ఠాకూర్ జీవన్ సింగ్.

**మెహిదీపట్నం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** వరంగల్ జిల్లా హనుమకొండ ఎల్కతుర్తి లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఠాగూర్ జీవన్ సింగ్ పిలుపునిచ్చారు. శనివారం బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ముత్యాల భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఠాకూర్ జీవన్ సింగ్ పాల్గొని కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్వాన్ డివిజన్ లోని బాంజవాడి, కార్వాన్, హనుమాన్ స్ట్రీట్, లక్ష్మీ నగర్ బస్తీలలో పాదయాత్ర నిర్వహించి సభకు లక్షలాదిగా తరలి రావాలని ప్రజలను కోరారు. అనంతరం ఠాగూర్ జీవన్ సింగ్, ముత్యాల భాస్కర్ లు మాట్లాడుతూ... ఎల్కతుర్తి లో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు కార్వాన్ నియోజకవర్గంలోని జియాగూడ, కార్వాన్, గుడిమల్కాపూర్, లంగర్ హౌస్, నానల్ నగర్, టోలిచౌకి, గోల్కొండ డివిజన్ ల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ అభిమానులు, ఉద్యమకారులు తమ సొంత వాహనాలలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రఘుపతి, ఉప్పలయ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





మణికొండ మున్సిపల్ వెంకటేశ్వర కాలనీలో ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న కాలనీ ప్రతినిధులు, ప్రజల దృశ్యం.

## గాంధీనగర్ డివిజన్‌లో కార్పొరేటర్ పాదయాత్ర

**చిక్కడపల్లి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:**

వేసవి కాలంలో విద్యుత్ అంతరాయాలను నివారించడంతో పాటు, విద్యుత్తు వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించడం జరుగుతుందని గాంధీ నగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ కుమార్ అన్నారు. శనివారం జవహర్ నగర్ లోని గడ్డం సార్ స్కూల్ వీధి, సబ్ లోక్ హాస్పిటల్ లేన్, స్ట్రీట్ నెంబర్ 10 స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ పావనీ వినయ కుమార్, బిజెపి శ్రేణులు, స్థానికులతో కలిసి జవహర్ నగర్ లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. షార్ట్ సర్క్యూట్ కావడంతో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ సరఫరాలో అంతరాయన్ని క్రమబద్ధీకరించాలని అధికారులకు సూచించారు.







